క్లుప్తంగా

నేడు పెట్రోల్‌బంకు ప్రారంభం

తెర్లాం: మండలంలోని నందిగాం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకును శనివారం ప్రారంభించనున్నట్లు స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు గుల్లిపల్లి మృత్యుంజయరావు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ప్రారంభోత్సవానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుతో పాటు, ఎంపీపీ, జెడ్పీటీసీ, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్, డీసీసీబీ చైర్మన్, సీఈఓ తదితరులు హాజరవుతారని, కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులంతా హాజరుకావాలని కోరారు.

ఇంటర్వ్యూకు 72 మంది హాజరు



వలంటీర్లను ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు

రాజాం సిటీ: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వలంటీర్ పోస్టుల ఇంటర్వ్యూ శుక్రవారం సజావుగా సాగింది. 11 వార్డు సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న మొత్తం 21 పోస్టులకుగాను 72 మంది హాజరైనట్లు ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ ఎంవీ నాగరాజు తెలిపారు. ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి ఆగస్టు 1వ తేదీన నియామక పత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో టీఎంసీ ఎస్‌వీ రత్నం, ఏఈ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బాధితురాలికి వైఎస్సార్ బీమా నగదు అందజేస్తున్న ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ నాగరాజు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని డోలపేట చిన్నచెరువు గట్టు వీధికి చెందిన కర్రి ధనలక్ష్మికి వైఎస్సార్ బీమా పథకం తక్షణసాయం కింద రూ.10 వేలను శుక్రవారం అందజేశారు. ఇటీవల ఆమె భర్త గోపినాయుడు అనారోగ్యంతో మృతి చెందడంతో ఈ సాయం అందించామని ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ ఎంవీ నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో టీఎంసీ ఎస్‌వీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

జోరుగా అభివృద్ధి పనులు



కొత్తగా నిర్మించిన సచివాలయ భవనం దగ్గర నిర్మిస్తున్న సీసీ రోడ్డు, కాలువలు

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస గ్రామంలో అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. కొత్తగా సచివాలయం, రైతుభరోసా కేంద్రం భవనాలు నిర్మించగా, వాటి దగ్గరకు వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు, కాలువలు నిర్మిస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన రూ.20 లక్షల నిధులతో సీసీ రోడ్డు, కాలువల నిర్మాణం చేపట్టామని, మరికొన్ని అభివృద్ధి పనులు చేయనున్నామని సర్పంచ్ కరణం గోవిందరావు తెలిపారు.

ప్రారంభానికి సచివాలయం సిద్ధం



రంగులద్దుకున్న సచివాలయ భవనం

రాజాం: మండలంలోని సోపేరు గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం ప్రారంభానికి సిద్ధమైంది. దాదాపు రూ.42 లక్షల వ్యయంతో ఈ భవనం నిర్మించగా, ఇటీవల పెయింటింగ్ పనులు కూడా పూర్తికావచ్చాయి. త్వరలోనే ఈ భవనాన్ని ప్రారంభిస్తామని ఎంపీడీఓ బాసూరి శంకరరావు తెలిపారు.

ట్రెజరీ కార్యాలయం సందర్శన

బొబ్బిలి: స్థానిక ట్రెజరీ కార్యాలయాన్ని ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్ మోహనరావు శుక్రవారం సందర్శించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికంగా ఉన్న కొంతమంది పెన్షనర్లు ఆయనను కలిసి, ఈకేవైసీ కోసం ఇబ్బందులు పడుతున్నామని, ట్రెజరీ సిబ్బందితో ఈకేవైసీ జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన ట్రెజరీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు రౌతు రామ్మూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే సీఎం జగన్ లక్ష్యం



పెదసెలగాంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: అన్ని వర్గాల అభ్యున్నతే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని రావివలస గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న ఎనుబరు, పెదసెలగాం, మూలసెలగాం, లొల్లరపాడు, మల్లు, సీతంపేట, ఎగువసెలగాం, రావివలస గిరిజన గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఎమ్మెల్యేకు ఆయా ప్రాంతాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో ఎనుబరువు గామంలోని తాగునీటి సమస్య, పెదసెలగాంలో రోడ్డు నిర్మాణం, ఇళ్లపైన ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్ల తొలగింపు, లొల్లరపాడులో నెలకొన్న విద్యుత్ సమస్య, ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు, ఇళ్లు, పోడుపట్టాల మంజూరు వంటి సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి రాగా, స్పందించిన ఎమ్మెల్యే ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని, ఓ వైపు అభివృద్ధి పనులు చేపడుతూనే మరోవైపు నిరంతరాయంగా సంక్షేమ పథకాల అమలు జరుగుతోందన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందుతున్నాయని, దీంతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. ప్రజల్లో ప్రభుత్వానికి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఇదిలా ఉండగా, కొన్ని గ్రామాలకు కాలినడకన, మరికొన్ని గ్రామాలకు ద్విచక్ర వాహనంపైనా ఎమ్మెల్యే వెళ్లి, ప్రజల యోగక్షేమాలు అడగడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రజా నాయకుడు అంటే ఇలా ఉండాలని ప్రశంసిస్తుండడం విశేషం. కార్యక్రమంలో ఎంపీపీ సీహెచ్ లక్ష్మణరావు, జెడ్పీటీసీ ఎ.సరస్వతి, బొబ్బిలి ఎంపీపీ ప్రతినిధి ఎస్.వేణుగోపాలనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు, రావివలస సర్పంచ్ ఎస్.కుమారి, మండల జేసీఎస్ కన్వీనర్ సీహెచ్ సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



బిల్లాని గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఇజ్జిపేట, బిల్లాని గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓ వైపు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చర్యలు చేపడుతూనే మరోవైపు ప్రతీ పేదవాడికి సంక్షేమ ఫలాలు అందేలా సీఎం జగనన్న పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గ్రామ సచివాలయం ద్వారా ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటింటికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఆయనదేనన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 98 శాతానికి పైగా హామీలు నెరవేర్చడం జరిగిందన్నారు. గతంలోని ఏ ప్రభుత్వమూ ఇంతలా హామీలను అమలు చేయలేదన్నారు. సచివాలయం పరిధిలో దాదాపు రూ.20 లక్షల వ్యయంతో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేలా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, అవినీతి రహిత పాలన కొనసాగుతోందన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు ఎస్.జగన్‌మోహన్‌రావు, వాసుదేవపట్నం సర్పంచ్ పి.గణపతిరావు, నాయకులు జి.శ్రీరాములనాయుడు, కె. ధనుంజయరావు, ఎ.సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమ్మె విరమణ



రామభద్రపురం కూరగాయల మార్కెట్‌లో పారిశుద్ధ్య పనుల్లో పాల్గొన్న కార్మికులు

రామభద్రపురం: స్థానిక మేజర్‌పంచాయతీ ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులతో అధికారుల చర్చలు సఫలమయ్యాయి. దీంతో వారు సమ్మె విరమించి, శుక్రవారం యథావిధిగా పారిశుద్ధ్య పనుల్లో పాల్గొన్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి తమ వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ వారు సమ్మె చేపట్టిన విషయం తెలిసిందే. డీఎల్‌పీఓ మోహనరావు ఆధ్వర్యంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులైన సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు, ఉపసర్పంచ్ చింతల రామకృష్ణతో పాటు సీఐటీయూ నాయకులు, పారిశుద్ధ్య కార్మికులతో రెండుసార్లు చర్చలు జరపగా, విఫలమయ్యాయి. శుక్రవారం పాలకవర్గం సభ్యులు, ఈఓ సుప్రియా, సీఐటీయూ నాయకులు మూడోసారి చర్చలు జరపగా, 14 మంది కార్మికుల్లో ఏడుగురికి రూ.9 వేలు, మరో ఏడుగురికి రూ.7,200 చొప్పున వేతనాలు పెంచేందుకు పాలకవర్గం అంగీకరించింది. దీనిపై పారిశుద్ధ్య కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తూ తాము విధుల్లో పాల్గొంటున్నామని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు

తెర్లాం: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని మండల ప్రత్యేకాధికారి, చీపురుపల్లి డీఎల్‌డీఓ వి.లక్ష్మణరావు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అధ్యక్షతన మండల స్థాయి అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఆయన జగనన్న ఇళ్ల లేవుట్లు, సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులతో మాట్లాడి, నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈఈ, ఏఈలకు సూచించారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యారోగ్య సిబ్బందితో చర్యలు చేపట్టాలన్నారు. పీహెచ్‌సీల్లో వైద్యులు అందుబాటులో ఉండి, అన్ని రకాల వ్యాధుల నివారణకు అవసరమైన మందులు నిల్వ ఉండేలా చూసుకోవాలన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో రోగుల తనిఖీలు, అవుట్ పేషెంట్‌లకు సంబంధించి, రిజిస్టర్లు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. మండలంలో జరుగుతున్న నాడు–నేడు పనులను సకాలంలో పూర్తి చేయించాలని ఎంఈఓ త్రినాధరావుకు చెప్పారు. అలాగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. సమావేశంలో హౌసింగ్ డీఈఈ అప్పయ్య, పీఆర్ ఏఈ రాజశేఖర్, ఉపాధి ఏపీఓ సుశీల, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవన నిర్మాణాలను వేగవంతం చేయండి

తెర్లాం: మండలంలో జరుగుతున్న సచివాలయ, హెల్త్ వెల్‌నెస్ సెంటర్, ఆర్‌బీకే ప్రభుత్వ భవనాలతో పాటు, జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, హౌసింగ్ డీఈఈ పలగర అప్పయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఏయే సచివాలయాల పరిధిలో భవన నిర్మాణాలు జరుగుతున్నాయో వాటి పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలని తెలిపారు. ఏయే పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలు ఏవో ఆయా పంచాయతీల్లో వాటి నిర్మాణాలను తక్షణమే చేపట్టేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో ఉద్యాన పంటల పెంపకాన్ని చేపట్టాలని, పంటల పెంపకంపై రైతులకు అవగాహన కలిగించాలన్నారు. హౌసింగ్ డీఈఈ మాట్లాడుతూ గ్రామాల్లోను, జగనన్న ఇళ్ల లేఅవుట్లలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను నిరీత గడువులోగా లబ్ధిదారులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సుశీల, హౌసింగ్ ఏఈ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులో శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఏఈ కుమార్ ఓ శుక్రవారం తెలిపారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కొత్త స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సకాలంలో గృహ నిర్మాణాల పూర్తి



బాడంగి: హౌసింగ్ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

బాడంగి: సకాలంలో గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులను మండల ప్రత్యేకాధికారి సీహెచ్‌ఎస్ చంద్రరావు కోరారు. శుక్రవారం మండలంలోని కామన్నవలస గ్రామంలో నిర్వహించిన హౌసింగ్ డే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులతో కాసేపు మాట్లాడారు. త్వరగా నిర్మాణాలు పూర్తి చేసి, గృహ ప్రవేశాలు చేసుకోవాలని తెలిపారు. నిర్మాణాలకు ప్రభుత్వం సహకరిస్తున్న విధానాన్ని లబ్ధిదారులకు వివరించి, నిర్మాణాలను వేగవంతం చేయాలని ఏఈ సత్యంను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: మండలంలోని పెంట గ్రామంలో నిర్వహించిన హౌసింగ్ డే కార్యక్రమంలో ఎంపీడీఓ పోతుల రవికుమార్ పాల్గొని, ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, సకాలంలో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు తెలిపారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

బొబ్బిలి: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో డీటీ గౌరీశంకర్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో అధిక ఆదాయం



చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ చంద్రరావు

రాజాం: చిరుధాన్యాల సాగుతో రైతులకు అధిక ఆదాయం వస్తుందని వ్యవసాయ శాఖ రాజాం ఏడీఏ కె.చంద్రరావు, జిల్లా డీఆర్‌సీ ఏడీఏ కె.భారతి తెలిపారు. మండలంలోని గార్రాజుచీపురుపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు చిరుధాన్యాల సాగుపై శుక్రవారం అవగాహన కల్పించారు. రబీ సీజన్‌లోనే కాకుండా ఖరీఫ్ సీజన్‌లో కూడా వినూత్నంగా చిరుధాన్యాలను సాగుచేయవచ్చన్నారు. ప్రధానంగా రాగి పంటను వేసుకోవాలని తెలిపారు. దేశ వ్యాప్తంగా చోడి పిండికి మంచి డిమాండ్ ఉందని, రాగిజావ ఎంతో ఆరోగ్యకరమన్నారు. ఈ పంట సాగుకు తక్కువ నీటి వనరులు, తక్కువ పెట్టుబడి అవుతుందన్నారు. ఎకరా పంటతో రూ.30 వేలకు పైగా ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో రాజాం వ్యవసాయ శాఖ అధికారిణి రేణుకాసాయి, సర్పంచ్ సన్యాసినాయుడు పాల్గొన్నారు.

మండలాన్ని ప్రగతి పథంలో నడిపించాలి



అధికారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి చంద్రరావు

బాడంగి: మండలాన్ని ప్రగతి పథంలో నడిపించాలని, ఆ దిశగా అధికారులంతా సమష్టిగా కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి సీహెచ్‌ఎస్ చంద్రరావు కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమావేశమైన ఆయన మండలాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ప్రతీ అధికారి తమ పరిధిలోని గ్రామాల్లో నిర్మిస్తున్న ప్రభుత్వ భవనాలు సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. భవనాలు మంజూరై, మూడేళ్లయినా కొన్ని గ్రామాల్లో భవన నిర్మాణాలు పూర్తికాకపోవడంపై ఆరాతీశారు. కోటిపల్లిబాడంగి, గూడెపువలస, తెంటువలస గ్రామాల్లో అర్ధాంతరంగా నిలిచిపోయిన నిర్మాణాలకు గల కారణాలను అడిగితెలుసుకున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ నిధులతో కూడా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. అలాగే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్యారోగ్య సిబ్బంది ద్వారా ఇంటింటా ఫీవర్ సర్వే చేసి, రోగులకు వైద్యసేవలందించాలన్నారు. అనంతరం ఉపాధి హామీ, గ్రామీణ తాగునీటి సరఫరా తదితర శాఖలపై సమీక్షించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ రమేష్, ఎంపీడీఓ ఆంజనేయులు, ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు పీఎం స్వానిధి రుణాలు



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ నాగరాజు

రాజాం సిటీ: వీధి వ్యాపారులకు పీఎం స్వానిధి పథకం ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ ఎంవీ నాగరాజు కోరారు. స్థానిక కార్యాలయంలో వీధి వ్యాపారులకు పీఎం స్వానిధి పథకం రుణాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మెప్మా పరిధిలోని వీధి వ్యాపారులకు అందిస్తున్న రుణాలను తీసుకుని, సకాలంలో చెల్లించాలన్నారు. అలా సకాలంలో రుణాలు చెల్లించిన వారికి రుణ పరిమితి పెంచుతామన్నారు. ఒక్క రాజాం పట్టణంలో 1030 మందికి రుణాలు ఇవ్వడం లక్ష్యం కాగా, మొదటి విడతలో 508 మంది, రెండో విడతలో 132 మందిని, మూడో విడతలో ఆరుగురిని గుర్తించామని మెప్మా టీఎంసీ ఎస్‌వీ రత్నం తెలిపారు. మిగిలిన లక్ష్యాన్ని కూడా త్వరలో పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆర్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్దనే తూకం వేయండి

రాజాం: స్థానిక ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి రేషన్ షాపులకు సరుకులు తీసుకువేళ్లే డీలర్లు ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్దనే సరుకులను తూకం వేసి తీసుకువెళ్లాలని రాజాం డీటీ చిరంజీవిరావు సూచించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన పలువురు డీలర్ల అభ్యర్థనల మేరకు ఈ చర్యలు చేపడుతున్నామన్నారు. తూకం ప్రకారం ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద సరుకులు ఇవ్వకపోతే టోల్ ఫ్రీ నంబర్ 1967కు ఫోన్ చేసి, ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు.

పక్కాగా డ్రైడే కార్యక్రమం

బొబ్బిలి: పక్కాగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమం చేపట్టాలని ఎంపీడీఓ పోతుల రవికుమార్ సూచించారు. మండలంలోని పెంట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన డ్రైడే కార్యక్రమంను ఆయన పరిశీలించి, ఇళ్లు, ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. అలాగే వైద్యారోగ్య సిబ్బంది ప్రతీ శుక్రవారం ఈ కార్యక్రమం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఇంటి వద్దకే వైద్యసేవలు

రేగిడి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వైద్యసేవలు అందుతున్నాయని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి జి.అసిరినాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని ఖండ్యాం గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్యారోగ్య సిబ్బంది పలువురికి ఆరోగ్య తనిఖీలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. అలాగే స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఖండ్యాం ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ ఆరోగ్య తనిఖీలు చేసి, సీజనల్ వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఉచితంగా ధ్రువీకరణ పత్రాల పంపిణీ



బొబ్బిలి: ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు



వంగర: లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ సురేష్ ముఖర్జీ

బొబ్బిలి/మెంటాడ/వంగర: మండలంలో పలుచోట్ల జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పలువురికి ఉచితంగా జనన, మరణ, కుల, ఆదాయం వంటి ధ్రువీకరణ పత్రాలను శుక్రవారం పంపిణీ చేశారు. బొబ్బిలిలో జరిగిన కార్యక్రమంలో బుడా చైర్మన్ ఇంటి పార్వతి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఇంటి గోపాలరావు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కలిసి అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేయగా, వంగరలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ చేతులమీదుగా దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. మెంటాడ మండలంలోని పెదమేడపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత పాటిపిరెడ్డి అప్పలనాయుడు ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఎటువంటి సర్వీసు ఫీజు లేకుండా ఈ ధ్రువపత్రాలను ప్రభుత్వం అందిస్తుండడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మణిపూర్‌లో దాడులు అరికట్టాలి



రాజాం సిటీ: మణిపూర్‌లో జరుగుతున్న దాడులకు నిరసనగా అంబేడ్కర్ కూడలిలో మానవహారం చేపట్టిన ప్రజాసంఘాల నేతలు



బొబ్బిలి: మాట్లాడుతున్న అంబేడ్కర్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సాంబయ్య

రాజాం సిటీ: మణిపూర్‌లో ఆదివాసీలపై జరుగుతున్న మారణ హోమంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మౌనం వీడి, దాడులను అరికట్టాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక పాలకొండ జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం అదే కూడలిలో మానవహారం చేపట్టి, మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని కోరారు. రాజకీయ లబ్ధి కోసం రెండు తెగల మధ్య విధ్వంసం సృష్టించిన ప్రధాని మోదీ, షా ప్రధాన దోషులని ఆరోపించారు. మైనార్టీలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, దమనకాండలపై సుప్రీంకోర్టు స్వయంగా విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మహిళలను నగ్నంగా ఊరేగింపు చేపట్టిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ డి.రామప్పడు, బొత్స బుద్ధుడు, రౌతు గణపతిరావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణం నెలకొల్పాలి..

బొబ్బిలి: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసాకాండను ఆపి, శాంతియుత వాతావరణం నెలకొల్పాలని అంబేడ్కర్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోరు సాంబయ్య కోరారు. మణిపూర్‌లో జరిగే అల్లర్లపై ప్రధాని మోదీ, అక్కడి ముఖ్యమంత్రి స్పందించకపోవడాన్ని నిరసిస్తూ స్థానిక పట్టణంలో శుక్రవారం శాంతియుత ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత వల్లే దారుణాలు జరుగుతున్నాయన్నారు. అమాయక ప్రజలపై దాడులు అమానుషమన్నారు. మహిళలపై అత్యాచారాలు అత్యంత హేయమన్నారు. ఇకపైనా ఆ రాష్ట్రంలో జరిగే దారుణాలు ఆగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.